క్లుప్తంగా

52 మంది వలంటీర్లు రాజీనామా



చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని వలివేరు, మోదుకూరు గ్రామాలకు చెందిన 52 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేసి రాజీనామా పత్రాలను బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ బుల్లియ్యకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చిన నాటి నుంచి టీడీపీ నాయకులు తమను అడుగడుగునా అవమానిస్తూనే మాట్లాడటం జరిగిందన్నారు. ఎన్నికల కోడును సాకుగా చూపి ఎన్నికల కమిషన్‌కు టీడీపీ నాయకులు తమపై ఫిర్యాదు చేసి తమను విధుల నుంచి తొలగించడం దారుణమని దీనికి నిరసనగా తామంతా మూకుమ్మడి రాజీనామాలు చేసినట్లు వారంతా తెలిపారు.

విధుల పట్ల అలసత్వం వద్దు



యడ్లపల్లి(వేమూరు): గ్రంథాలయాధికారులు విధుల పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించరాదని ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ అన్నారు. చుండూరు మండలంలోని యడ్లపల్లి గ్రామంలో శాఖా గ్రంథాలయాన్ని ఆమె బుధవారం తనిఖీ చేశారు. గ్రంథాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి గిరిజా సుందరి పాల్గొన్నారు.

చుండూరు(భట్టిప్రోలు): చుండూరు మండలం యడ్లపల్లిలోని శాఖా గ్రంథాలయాన్ని బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ వి.సుబ్బరత్నం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో శాఖా గ్రంథాలయాధికారిణి బి.గిరిజా సుందరి, సిబ్బంది ఉన్నారు.

కొత్తపేటలో ప్రీస్కూల్ సంసిద్ధత



బాపట్ల: పట్టణంలోని 30వ వార్డు ఇస్లాంపేట, కొత్తపేట అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం సీబీ ఈవెంట్‌లో భాగంగా ప్రీస్కూల్ సంసిద్ధత కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్త సయ్యద్ కరీమున్నీసా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీడీపీవో బి శైలజ, సూపర్వైజర్ శేషకుమారిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 5 సంవత్సరాలు నిండిన పిల్లలతో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి ప్రీస్కూల్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అంగన్వాడీ కార్యకర్తలు సయ్యద్ కరీమున్నీసా, వై.పార్వతి, ఎ.భాగ్యలక్ష్మీ, ఆయా కె.ఎమేలమ్మ, మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజారంజక పాలన జగనన్నతోనే సాధ్యం

పిట్టలవానిపాలెం: మీకు మంచి జరిగితేనే నాకు అండగా ఉండండి అని ఎన్నికలకు వెళ్తున్న ఒకే ఒక్క నాయకుడిగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారని వైఎస్సార్ సీపీ నాయకులు, బాపట్ల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కోన రఘుపతి తనయుడు కోన నిఖిల్ అన్నారు. మండలంలోని ఖాజీపాలెం గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను 99.5 శాతం అమలు చేసి నవరత్నాల రూపంలో సంక్షేమాన్ని ప్రజలకు అందించి సీఎం జగన్ ఎన్నికలకు వెళ్తున్నట్లు తెలిపారు.బాపట్ల శాసన సభ్యునిగా కోన రఘుపతిని మూడోసారి ఆశీర్వదించాలని కోరారు. బాపట్ల జిల్లా అభివృద్ధి మరింత ముందుకు వెళ్లాలంటే బాపట్లకు ఎమ్మెల్యేగా కోన రఘుపతి అవసరం ఉందన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, బడుగు ప్రకాశరావు, కూసంపూడి దేవేంద్ర రాజు, మంతెన గంగరాజు, గుమ్మడి సీతయ్య, బడుగు మాధవి, మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, కుంకం ప్రసన్నరాజు, చేబ్రోలు వీరయ్య, వాలి శివారెడ్డి, గోపి, మండే విజయ్‌కుమార్, కోటిరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, బొలగాని సుబ్బారావు, సురేష్ బాబు తదితరులు ఉన్నారు.

అపార్ట్‌మెంట్ నుంచి కింద పడిన వృద్ధురాలికి గాయాలు

తెనాలిరూరల్: అపార్ట్‌మెంట్ నుంచి పడి వృద్ధురాలు తీవ్ర గాయాల పాలైన ఘటన తెనాలిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ కొత్తపేటలోని అష్టలక్ష్మి గుడి పక్కన ఉన్న అపార్ట్‌మెంట్ 4వ అంతస్తులో 65 ఏళ్ల బెజవాడ త్రివేణి తన కుటుంబంతో నివసిస్తోంది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ప్రమాదవశాత్తు పై నుంచి కింద పడి తీవ్ర గాయాలపాలైంది. ప్రకాశం రోడ్డులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్స కోసం తాడేపల్లిలోని వైద్యశాలకు పంపారు. వన్‌టౌన్ పోలీసులు త్రివేణి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు.

పింఛను కోసం పండుటాకుల పరుగులు

- సచివాలయాల వద్ద బారులు తీరిన లబ్ధిదారులు
- గత అనుభవాలతో చంద్రబాబుకు శాపనార్థాలు పెట్టిన అవ్వా తాతలు
- ఇంటింటికీ పంపిణీ చేయాలని లబ్ధిదారుల వేడుకోలు
- ఆటో, రిక్షాల్లో సచివాలయాలకు చేరుకున్న దివ్యాంగులు, వృద్ధులు



రేపల్లె పట్టణంలో పింఛను నగదు కోసం వరుస కట్టిన లబ్ధిదారులు

రేపల్లె రూరల్: పండుటాకులపై టీడీపీ అధినేత చంద్రబాబు తన పంతాన్ని నెగ్గించుకున్నాడు. తన పచ్చ బ్యాచ్‌తో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి వలంటీరులను సేవలకు దూరం చేయటంతో పింఛన్‌లు పొందే లబ్ధిదారుల కష్టాలు వర్ణనాతీతంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో పింఛన్‌దారులు పింఛన్ అందజేసే ప్రాంతానికి వెళ్లి పింఛన్ పొందేవారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి పగ్గాలు చేపట్టిన నాటి నుంచి అవ్వాతాతలకు పింఛన్ అందించే విధానంలో సమూల మార్పులు తీసుకొచ్చారు. వలంటీరు దళాన్ని తీసుకువచ్చి ప్రతి నెల 1వ తారీఖునే కోడి కూయక ముందే అవ్వా తాతలకు పింఛన్ అందించే విధానాన్ని తీసుకువచ్చి వారి కళ్లల్లో ఆనందం నింపారు. అయితే ఎన్నికల కోడ్ అమలు కావడంతో వలంటీర్ల సేవలకు బ్రేక్‌లు వేయాలని, వృద్ధులకు పెన్షన్ సైతం అందించరాదంటూ నేరుగా ఎన్నికల కమిషన్‌కు చంద్రబాబు ఫిర్యాదు చేయటంతో టీడీపీ హయాంలో అవ్వాతాతలు పడ్డ కష్టాలు మరలా పునరావృతం అయ్యాయి. రేపల్లె నియోజకవర్గంలో బుధవారం పింఛన్‌ల కోసం అవ్వా తాతలు, దివ్యాంగులు సచివాలయాల వద్ద మండుటెండను సైతం లెక్కచేయక బారులు తీరారు. జగనన్న ఇంటికే ఇస్తున్న పింఛన్‌కు చంద్రబాబు అడ్డుపడటంతో పింఛన్‌దారులు గత టీడీపీ హయాంలో పడ్డ కష్టాలను మరోమారు గుర్తు చేసుకున్నారు. సచివాయాల వద్ద పింఛన్ ఇస్తుండటంతో పింఛన్‌దారుల బంధువులు, బిడ్డలు తమ పనులను పక్కన పెట్టి వాహనాలపై కేంద్రాలకు తీసుకువెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

పింఛను నగదు కోసం పాట్లు

కర్లపాలెం: కూటమి నాయకుల దుశ్చర్యలకు పలు రకాల పింఛను లబ్ధిదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రతినెలా వలంటీర్లు తలుపు తట్టి పింఛను నగదు ఇవ్వగానే ఎంతో ఆనందించే వృద్ధులు, వితంతువులు, వికలాంగులు తమ ఇంటికి పింఛను నగదు రాదని తెలుసుకుని తల్లడిల్లిపోయారు. కర్లపాలెం మండల పరిధిలోని 20 గ్రామ పంచాయతీలలో ఉన్న 15 సచివాలయాల పరిధిలో 8,123మంది పింఛన్ల లబ్ధిదారులు ఉన్నారు. ప్రతినెలా 1వ తారీఖున అందే పింఛను ఈ నెల అందకపోవటంతో పింఛను వస్తుందో లేదో అని ఆందోళనకు గురవుతున్న లబ్ధిదారులు గ్రామ సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. 15 గ్రామ సచివాలయాల పరిధిలో బుధవారం అధికారులు 24 శాతం మంది లబ్ధిదారులకు మాత్రమే పింఛను నగదు అందజేసి పంపిణీ కార్యక్రమాన్ని మమ అనిపించారు. వికలాంగులు, నడవలేని వృద్ధులు తమ పింఛను నగదు ఇంటికే తీసుకువచ్చి ఇవ్వాలని అధికారులను వేడుకుంటున్నారు.



కొల్లూరు సచివాలయం వద్ద ఫించన్ సొమ్ము కోసం లబ్ధిదారుల నిరీక్షణ



జంపని గ్రామ సచివాలయంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సిబ్బంది

తొలి రోజు 25 శాతం పింఛన్ల పంపిణీ

భట్టిప్రోలు: సచివాలయాల ద్వారా పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని తెలియడంతో బుధవారం కార్యాలయాలు తెరవకముందే పింఛన్‌దారులు పింఛన్ల కోసం నిరీక్షించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వలంటీర్లను విధుల నుంచి తప్పించడంతో పింఛన్‌దారులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొందరు పింఛన్‌దారులు ఇంటి వద్ద లేకపోయినప్పటికీ వారు పనులు చేస్తున్న చోటకు వెళ్లి వలంటీర్లు పింఛన్లు అందించిన సందర్భాలు కోకొల్లలు. ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న లబ్ధిదారులకు సైతం పింఛన్లు పంపిణీ చేసేవారు. భట్టిప్రోలు-1 సచివాలయంలో పింఛన్ల పంపిణీ ఆలస్యం జరగడంతో పింఛన్‌దారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో మొత్తం 8,721 పింఛన్లకు గాను సాయంత్రానికి 25 శాతం పంపిణీ జరిగింది. రాత్రి పొద్దుపోయే వరకు సచివాలయ సిబ్బంది ఉన్న పింఛన్‌దారులకు పింఛన్లు అందజేశారు. పింఛన్ల పంపిణీ వేగవంతానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో జేబీవీ మల్లికార్జునరావు తెలిపారు.

గ్రామ సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ

వేమూరు: గ్రామ సచివాలయాల్లో పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఒకరిని ఒక రు నెట్టుకొంటూ పింఛను తీసుకుంటున్నారు. గ్రామ వలంటీర్లు ప్రతి నెల 1వ తేదిన ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ల పంపిణీ చేయడంతో ఎన్నో ఏళ్లుగా లబ్ధిదారులకు కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ తప్పింది. తాజాగా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు వలంటీర్లు ద్వారా పింఛన్ల ఇవ్వరాదని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్నికల కమిషన్ వలంటీర్లు ద్వారా పింఛన్ల పంపిణీ చేయరాదని ఆదేశాలు జారీ చేసింది. దీంతో అవ్వా తాతలు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు గ్రామ సచివాలయం వద్దకు చేరుకొని పింఛన్లు తీసుకుంటున్నారు. దీంతో చాలా ఏళ్ల తర్వాత పింఛన్ల పంపిణీ వ్యవస్థ గత తెదేపా పాలనను తలపించింది.

బాపట్ల: తెలుగుదేశం పార్టీ వలంటీర్ల పింఛన్ల పంపిణీపై ఫిర్యాదులు చేయటంతో ఇంటింటికీ పింఛన్ పంపిణీ కార్యక్రమం నిలిచిపోయింది. ప్రతి నెల ఒకటో తేదీనే పింఛన్ తీసుకునే అవ్వా తాతలు సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు. ఎర్రటి ఎండలో సైతం పింఛన్ సొమ్ము కోసం ఎదురు చూశారు. బాపట్ల పట్టణంలోని 6,600 మంది పింఛనుదారులు ఉన్నారు. గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు పంపిణీ చేస్తామని సచివాలయం సిబ్బంది చెబుతున్నారు.

టీడీపీ చేసిన పాపం.. ఫించన్‌దారులకు శాపం

కొల్లూరు : ఫించన్‌లు పొందే అవ్వా తాతలు, దివ్యాంగులు, ఇతర పెన్షన్ లబ్ధిదారులకు టీడీపీ చేసిన పాపం శాపంలా పరిణమించింది. ప్రతి నెలా వలంటీర్ల ద్వారా తెల్లవారు జామునే ప్రభుత్వం ఫించన్ల పంపిణీ చేసి లబ్ధిదారులకు కొండంత అండగా నిలుస్తున్న తరుణంలో ఎన్నికలను అడ్డం పెట్టుకుని ప్రతిపక్ష పార్టీ చేసిన కుయుక్తులకు ఫించన్‌దారులు అష్టకష్టాలు పడాల్సిన అఘుత్యం ఏర్పడింది. మండుతున్న ఎండల్లో ఫించన్ కోసం సచివాలయాల వద్దకు వెళ్లడానికి వృద్ధులు, దివ్యాంగులు, ఇతర ఫించన్‌దారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. పొలం పనులు, ఇతర రోజువారి కార్యక్రమాలలో నిమగ్నమయ్యే లబ్ధిదారులు తమ పనులు మానుకొని సచివాలయాల వద్ద ఫించన్ సొమ్ము కోసం వేచి ఉండటంతో టీడీపీపై విమర్శలు వ్యక్తం చేశారు. ప్రతి నెలా ఇంటికే ఫించన్ తీసుకొచ్చి ఇచ్చే వలంటీర్లపై ఎన్నికల సంఘానికి తన అనుయాయులతో ఫిర్యాదులు చేయించి ఫించన్‌దారులను ఎర్రటి ఎండలకు బలిచేయడంపై టీడీపీని లబ్ధిదారులు దుయ్యబట్టారు. కొల్లూరు మండలంలో 9,277 మంది ఫించన్‌దారులు ఉండగా, 16 సచివాలయాల పరిధిలో తొలి రోజు 5,345 మందికి 58 శాతం మేర ఫించన్లను పంపిణీ చేశారు. సచివాలయాల వద్ద ఫించన్‌దారులు ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్త చర్యలుగా కుర్చీలు, టెంట్లు, మంచి నీటి సదుపాయం కల్పించి ఫించన్ల పంపిణీ చేపట్టారు.



నగరం సచివాలయానికి పింఛను కోసం ఆటోలో వచ్చిన వృద్ధురాలు



ఇందిరా కాలనీలోని సచివాలయం వద్ద పింఛను కోసం ఎదురు చూస్తున్న వృద్ధులు



కర్లపాలెం గ్రామ సచివాలయం వద్ద పింఛను నగదు కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు



భట్టిప్రోలు సచివాలయం-1లో పింఛన్ కోసం గుమిగూడిన పింఛనుదారులు

వ్యవసాయ సాంకేతిక నైపుణ్యాలపై దృష్టి పెట్టండి



పరిశోధనా పత్రాలను ఆవిష్కరిస్తున్న వైస్ ఛాన్సలర్ డాక్టర్ శారద జయలక్ష్మీదేవి, డీన్ డాక్టర్ శ్రీనివాసరావు

వైస్ ఛాన్స్‌లర్
డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి

బాపట్ల: నేటి వ్యవసాయ విద్యార్థులకు వ్యవసాయ రంగంలోని శాస్త్ర సాంకేతికత పట్ల అవగాహన పెంపొందించుకునేందుకు అనేక అవకాశాలు ఉన్నాయని వాటిని అనుసరించి ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ ఉప కులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి పేర్కొన్నారు. భవిష్యత్తు వ్యవసాయం, వ్యవసాయ శాస్త్ర సాంకేతిక రంగాల ఆలంబనగా నూతన సాంకేతిక పరిజ్ఞానం ఆవిష్కరణపై రెండోరోజు బుధవారం సదస్సు జరిగింది. ఈ సదస్సులో డాక్టరు ఆమె మాట్లాడుతూ వనరుల లభ్యత, వాతావరణ ప్రతికూల పరిస్థితులు, ఇతర కారణాల వలన వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం, దానిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గల మార్గదర్శక సూత్రాలను నిపుణులైన ఉపన్యాసకులచే విద్యార్థులకు బోధించడంలో ఈ సదస్సు విజయవంతమైందన్నారు. ఈ సదస్సు ద్వారా శిక్షణ పొందిన వివిధ రాష్ట్రాలకు చెందిన వ్యవసాయ విద్యార్థులు తాము పొందిన జ్ఞానాన్ని వ్యవసాయ రంగ ఉన్నతికై వినియోగించి అన్నదాతకు చేదోడుగా ఉండాలని కోరారు. భవిష్యత్తు తరం బాగుండాలంటే విద్యార్థులు ఈ సదస్సులో చర్చించబడిన సాంకేతికత, వ్యవసాయంలో లేజర్, జీనోమిక్స్, బయోఏజెంట్స్, కృత్రిమ మేధ విషయాలపై నేటి నుంచే దూరదృష్టితో ఆలోచించవలసిన అవసరం ఉందన్నారు.ఆధునిక వ్యవసాయ పద్ధతులను ఆకళింపు చేసుకోవడంతో వ్యవసాయ జ్ఞానాన్ని సముపార్జించుకోవలసిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగిన ఈ సదస్సు ద్వారా వ్యవసాయ విద్యార్థులు తమ జ్ఞానాన్ని పరస్పరం వ్యక్తీకరించుకోడానికి అవకాశం కలిగిందన్నారు.యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ సయ్యద్ జవహర్ మాట్లాడుతూ వ్యవసాయ పట్టభద్రులకు అగ్రి క్లినిక్కుల స్థాపనకు తమ బ్యాంకు ద్వారా రూ. 25 లక్షల వరకు లోన్లు ఇవ్వడం ద్వారా వృత్తి భద్రత కల్పిస్తున్నామన్నారు. టిష్యూ కల్చర్, గ్రీన్ హౌస్ ల ఏర్పాటుకు కూడా తక్కువ శాతం వడ్డీతో లోన్లు ద్వారా ప్రోత్సాహకాలను ఇస్తున్నట్లు తెలిపారు. స్యూరిటీ లేకుండా రూ.2 కోట్ల వరకు వ్యవసాయ విద్యార్థులకు ఋణ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన పి.జి. డీన్ డా.ఏ.వి.రమణ ,డైరెక్టర్ అఫ్ ఎక్స్‌టెన్షన్ డా.కె.ఎస్.ఎస్.నాయక్, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డా. జి. కరుణ సాగర్ కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. సాయిరాం కుమార్, విద్యార్థి విభాగ ఆర్గనైజింగ్ సెక్రటరీ అక్షయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాల మీద విద్యార్థులు రూపొందించిన పరిశోధన పత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు.

వయోవృద్ధులకు వెసులుబాటు

- ఇంటి వద్దనే ఓటు వినియోగించుకునేలా ఈసీ ఆదేశాలు జారీ
- బీఎల్‌ఓల సమావేశంలో వెల్లడించిన తహసీల్దార్ శృతి

పిట్టలవానిపాలెం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 85 ఏళ్ల వయసు, 49 శాతం పైబడి అంగవైకల్యం కలిగిన ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్లాల్సిన పని లేకుండా ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిందని తహసీల్దార్ శృతి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలకు రాలేని వయోవృద్ధులు, అంగవైకల్యం కలిగిన వారు, ఓటు వేయలేని స్థితిలో ఉన్నవారు ఇంటి వద్దనే ఉండి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉందని తెలిపారు. బీఎల్‌ఓలు తమ పరిధిలో 85 ఏళ్లు నిండిన వయోవృద్ధులు, వికలాంగులు, పోలింగ్ కేంద్రానికి రాలేని స్థితిలో ఉన్న వారి జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓలు అమానుల్లాఖాన్, అలపర్తి వెంకట సుబ్బారావు, వీరనాయుడు, బూసిమ్మ, నాగజ్యోతి, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శృతి

సంక్షేమ పాలనకు మద్దతు పలకండి

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- కర్లపాలెం మండలంలో ఇంటింటి ప్రచారం

కర్లపాలెం: మీ కుటుంబంలో మంచి జరిగితేనే సంక్షేమ పాలనకు మద్దతు పలికి ఫ్యాన్ గుర్తుకు ఓటు వెయ్యాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని శీలంవారిపాలెం, సమ్మెటవారిపాలెం, పేరలి, తుమ్మలపల్లి గ్రామాలలో కోన రఘుపతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శీలంవారిపాలెంలో ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించారు. పేరలి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్నికల ప్రచారంలో మహిళలు రఘుపతికి హారతులిచ్చి వీరతిలకం దిద్దారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రఘుపతి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థులు సంతోషంగా ఉన్నారని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో అర్హతలను బట్టి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఎంపీపీ యారం వనజ, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, వైస్ ఎంపీపీ కాగిత బుల్లియ్య, సర్పంచ్‌లు పిట్టు నాగాంజనేయరెడ్డి, మల్లెల వెంకటేశ్వర్లు, దబ్బకూటి ఏడుకొండలు, నాయకులు సలగల ధర్మేంద్ర, చిక్కాల సాగర్, సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, ఆట్ల నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోన రఘుపతికి తిలకం దిద్దుతున్న పేరలి మహిళలు

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేద్దాం



భట్టిప్రోలులో ఇంటింటి ప్రచారంలో ఓటును అభ్యర్థిస్తున్న అశోక్‌బాబు సతీమణి లక్ష్మి

భట్టిప్రోలు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించడమే లక్ష్యం కావాలని వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సతీమణి లక్ష్మి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని విఠలేశ్వర నగర్, అద్దేపల్లి పురవీధులలో రెండో రోజు పార్టీ శ్రేణులతో కలసి ఆమె ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. విఠలేశ్వరనగర్‌లో మానసిక వైకల్యంతో బాధ పడుతున్న చిన్నారి ఒగ్గి హరిశ్వర్ తల్లిదండ్రులను పరామర్శించి భరోసా కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, ఎంపీటీసీ సభ్యులు కొతరపు పద్మావతి, గద్దె సుశీల, దారావత్ కుమారిభాయ్, నన్నెపాముల చంటి, గోవర్ధనగిరి పెద్దబుజ్జి, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నాయకులు బండారు శ్రీనివాసరావు, ఎంఎ రహమాన్, తలకొల యలమంద, పప్పల చిరంజీవి, పప్పల విజయరాజు, నిమ్మగడ్డ ప్రమీల, మద్దుల గిరిధర్, కుందేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మోదుకూరులో ఎన్నికల ప్రచారం

మోదుకూరు(వేమూరు): చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామంలో గురువారం ఉదయం 7 గంటలకు ఎన్నికల ప్రచారం ప్రారంభించడం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షులు అనపురెడ్డి రాఘరామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రచారంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ఇంటింటి ప్రచారం చేస్తారని ఆయన తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రచారం విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎండలపై ప్రజలను అప్రమత్తం చేయండి

ఆర్డీవో హెలా షారోన్



రేపల్లె రూరల్: వేసవి ఎండ తీవ్రతపై, వడగాల్పులతో చోటు చేసుకునే నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించి అప్రమత్తం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆర్డీవో హెలా షారోన్ అన్నారు. వేసవి ఎండ తీవ్రతపై చేపట్టాల్సిన విధులపై పట్టణంలోని రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ వేసవిలో పగటి ఉష్ణోగ్రత అధికంగా ఉండటంతో పాటు వడగాల్పులు అధికంగా వీచే ప్రమాదం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పట్టణ, మండలంలో జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాలలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల విధుల నుంచి వైద్యారోగ్య శాఖ అధికారులకు ఉపశమనం కలిగించినందున ఆ శాఖ అధికారులు వేసవితో కలిగే ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వైద్యశాలలో ప్రజలకు అవసరమైన ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలలోనూ అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శేషాద్రి, తహసీల్దార్ రవీంద్ర, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఎమ్మెల్యే కోన ఇఫ్తార్ విందు

కర్లపాలెం: రంజాన్ పండుగను పురస్కరించుకుని కర్లపాలెం మండల పరిధిలో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే కోన రఘుపతి బుధవారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. కర్లపాలెం పంచాయతీ పరిధిలోని ఎంవి రాజుపాలెం షాదీఖానా, పాత ఇస్లాంపేట, కర్లపాలెం సెంటర్‌లోని మసీదుల్లో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. మండల పరిధిలోని పేరలి, గణపవరం, నాగరాజుపాలెం గ్రామాలలోని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఎంపీపీ యారం వనజ, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఎస్‌కె ఆసిఫ్ అలీ, కోఆప్షన్ సభ్యుడు ఎండి అమీర్‌బేగ్, షేక్ తాజ్, షంషీర్ జానీ తదితరులు ఉన్నారు. ముస్లిం మతపెద్దలు ఉన్నారు.

టీడీపీ నాయకులకు ఓటమితో బుద్ధి చెప్పాలి



బాపట్ల: ప్రతి నెల ఒకటో తేదీన ఇంటికొచ్చి పెన్షన్ అందించిన వలంటీర్లు వద్దంటూ తెలుగుదేశం పార్టీ టీం ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి అందరిని ఇబ్బందులకు గురి చేయటాన్ని దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య తీవ్రంగా ఖండించారు. దివ్యాంగులు, వృద్ధులు తెలుగుదేశం పార్టీ నిరంకుశ వైఖరితో తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆయన దుయ్యబట్టారు. ఈ మేరకు స్థానిక కార్యాలయం వద్ద తమకు ప్రతినెల ఇంటికే పెన్షన్ అందించేలా చూసే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం చల్లా రామయ్య మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి పెన్షన్‌దారులను మోసం చేస్తూనే వచ్చిందన్నారు. ప్రతినెల ఉదయాన్నే ఇంటికి పెన్షన్ అందించేందుకు కృషి చేసిన వలంటీర్లను తొలగించటం సరికాదన్నారు. వచ్చే ఎన్నికల్లో పెన్షన్‌దారులు తెలుగుదేశం పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని చల్లా రామయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిట్టా రాజారావు, సానాల నరసింహారెడ్డి, తోలి ఆనందరావు, మణి, విజయలక్ష్మీ, తోటా రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.